కార్మికులకు ఆరోగ్య కిట్లు



వనపర్తిలో ఆప్రన్లు ధరించి విధులు నిర్వర్తిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు (ఫైల్)

- పురపాలక సిబ్బందికి అందిస్తున్న అధికారులు
- రూ.12లక్షలతో కొనుగోలు
- పారిశుద్ధ్య, కామాటీలు, వాటర్ సప్లై, ఎలక్ట్రికల్ కార్మికులకు ప్రయోజనం

వనపర్తి టౌన్: పురపాలక పరిధిలో పని చేస్తున్న కార్మికుల రక్షణకు అధికార యంత్రాగం చర్యలు చేపట్టింది. తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు విధులు నిర్వర్తించే పారిశుద్ధ్య, వాటర్ సప్లై, ఎలక్ట్రికల్ విభాగంలో పనిచేసే కార్మికుల రక్షణకు చొరవచూపుతున్నారు. ప్రతి ఏడాది కార్మికులకు విధిగా దుస్తులు, ఆరోగ్య పరిరక్షణకు దోహదం చేసే వస్తువులను అందజేయాల్సి ఉంది. కానీ మూడేళ్లు అరకొరగా దుస్తువులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని కార్మికులు వాపోతున్న తరుణంలో కార్మికులకు కావాల్సిన సామగ్రిని అందజేయనున్నారు. సుమారుగా రూ. 12 నుంచి 15 లక్షలు కేటాయించి కొనుగోలు చేసినట్లు అధికారులు తెలిపారు.

500 జతల ఆప్రన్లు..

కార్మికులు రోడ్లపై విధులు నిర్వర్తించే సమయంలో వాహనదారులు వారిని గుర్తించేందుకు వీలుగా ఉండేలా రేడియంతో తయారు చేసిన 500 జతల ఆప్రన్లు తెప్పించారు. వీటి ద్వారా పగలు, రాత్రి పూట కార్మికులు ప్రమాదాల బారిన పడకుండా వారి విధులు సక్రమంగా నిర్వహించేందుకు దోహదపడనుంది. డ్రైయినేజీలో మురుగు, వీధుల్లో నిచెత్త, ఇంటింటి చెత్త సేకరించే కార్మికుల కోసం 250 జతల గ్లౌజులను అందుబాటులో ఉంచారు. అంతేకాకుండా డ్రైనేజీ శుభ్రం చేసే కామాటీలు కోసం 600 సబ్బులు, ఒక్కొక్క కార్మికుడికి లీటర్ చొప్పున కొబ్బరి నూనె అందించేందుకు మొత్తం 300 లీటర్లు సిద్ధం చేశారు. విద్యుత్ స్తంభాలు ఎక్కేందుకు, మురుగు కాల్వలో దిగే కార్మికులకు అనువుగా ఉండేలా 85 జతల నాణ్యమైన బూట్లు తెప్పించారు.

9 కిలోమీటర్ల మేర పనులు

ప్రస్తుతం పురపాలికలో అంతర్గత, ప్రధాన రహదారులు 9కిలో మీటర్ల మేర విస్తరించి ఉన్నాయి. వీటన్నింటీ శుభ్రం చేసేందుకు పారిశుద్ధ్య విభాగంలో 148 మంది, ఇంజినీర్ విభాగంలో 92, ఎలక్ట్రిసిటీ విభాగంలో 10మంది, మస్టర్ పద్ధతిలో 16 మంది కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. నిత్యం ప్రధాన, అంతర్గత రహదారులను శుభ్రం చేసేందుకు 36 మంది, ఇంటింటి చెత్త సేకరణకు 31 మంది, డ్రెయినేజీలు శుభ్రం చేసేందుకు 33 మంది, డ్రైవర్లు 24 మంది, జవాన్లు 8మంది, సెక్యూరిటీ ఇద్దరు కార్యాలయంలో, మిగిలిన వారు పార్కులు, నర్సరీలు ఇతరత్రా ప్రాంతాల్లో విధులను నిర్వహిస్తున్నారు. వాటర్ సప్లై లైన్‌మెన్లుగా వీధుల్లో విధులు నిర్వర్తించే వారు 70 మంది, రామన్‌పాడు రిజర్వాయర్, కానాయపల్లి పంప్‌హౌస్, ఎర్రగట్టు వద్ద, కార్యాలయం, పార్కుల్లో కలిపి 22 మంది. విద్యుత్ విభాగంలో 10 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. వీరందరికి ఆరోగ్య కిట్లు అందనున్నాయి.

కార్మికుల ఆరోగ్యం ముఖ్యం..



దుర్వాసనలో నిత్యం విధులు నిర్వహించే కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు కిట్లు అందిస్తున్నాం. ఇందులో భాగంగానే కార్మికులకు ఇది వరకే దుస్తులు పంపిణీ చేశాం. కొబ్బరి నూనె, బూట్లు, ఆప్రీన్లు, గ్లౌజుల పంపిణీకి ఏర్పాట్లు చేశాం. అనాదిగా పుర కార్మికులకు అందజేయాల్సిన విధానాన్ని కొనసాగించేందుకు ప్రత్యేక చొరవ తీసుకున్నాం.

– ఉమామహేశ్వర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్

సాగునీటి కాల్వలో పేరుకుపోయిన జమ్ము



సాగునీటి కాల్వలో పేరుకుపోయిన జమ్ము, పిచ్చిమొక్కలు

పాన్‌గల్: మండల కేంద్రంలోని కేఎల్ఐ కాల్వకు అనుసంధానంగా ఉన్న సాగునీటి కాల్వలో పేరుకపోయిన జమ్ము, పిచ్చి మొక్కలను తొలగించాలని రైతులు కోరుతున్నారు. ఉపాధి హామీ పథకంలో రైతులకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఒక పక్క అధికారులు, ప్రజాప్రతినిధులు చెబుతున్నా వీటిని క్షేత్ర స్థాయి ఉపాధి సిబ్బంది ఏమాత్రం పట్టించుకోవడంలేదని రైతులు వాపోతున్నారు. రైతులకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత ఇవ్వకుండా ఉపయోగంలేని పనులను చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం సీజన్ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో కాల్వలకు సాగునీరు విడుదలకు ముందే కాల్వలో పేరుకపోయిన జమ్ము, పిచ్చిమొక్కలను తొలగించి చివరి ఆయకట్టుకు సాగునీరు అందేలా చూడా లని రైతులు కోరుతున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు ఉపాధి అధికారులకు విన్నవించినా ఏమాత్రం పట్టించుకోవడంలేదని రైతులు వాపోతున్నారు.

గ్రామాల్లో కాంగ్రెస్‌కు పూర్వవైభవం



మిట్టనందిమళ్లలో పార్టీ జెండాకట్టను పరిశీలిస్తున్న ప్రశాంత్‌రెడ్డి



ఆత్మకూర్‌లో..

అమరచింత: కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం సంతరించుకుంటుందని, గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ జెండా పండుగలకు సర్వం సిద్ధం చేస్తున్నామని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కె.ప్రశాంత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని మిట్టనందిమళ్ల, ఈర్లదిన్నె గ్రామాల్లో సోమవారం కాంగ్రెస్ జెండా కట్టల మరమ్మతుతో పాటు రంగులద్దే కార్యక్రమాలను స్వయంగా పరిశీలించారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో అలిసిపోయిన ప్రజలు మళ్లీ ఇందిరమ్మ రాజ్యం కోసం ఎదురు చూస్తున్నారన్నారు. నాడు పేదల సంక్షేమమే ధ్యేయంగా భావించి సంక్షేమ పథకాలను అందించిన కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో నేటికీ ఆదరణ ఉందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్, బీజేపీలు ఒక్కటే అన్న విషయం ప్రజలకు ఇప్పటికే అర్థం అయ్యిందనే విషయాన్ని గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ గతంతో చేసిన పనులే నేటికీ పదిలంగా దర్శనమిస్తున్నాయన్నారు. నాడు ఇందిరమ్మ పేరిట ఇచ్చిన ఇళ్లు తప్ప ఇప్పటి వరకు నియోజకవర్గంలో ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇచ్చిన దాఖాలాలు లేవన్నారు. కార్యక్రమంలో జుబేర్‌అహ్మద్, విష్ణువర్ధన్ యాదవ్, ఆయూబ్, రాకేష్, ప్రశాంత్‌రెడ్డి, పెద్ద వెంకట్‌రెడ్డి, గోవిందు, తాయప్ప, రంగారెడ్డి, వెంకట్‌రెడ్డి, మాధవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని ఖమ్మంలో జరిగిన తెలంగాణ జనగర్జన అందుకు నిదర్శమని నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు తులసీరాజ్, జిల్లా కార్యదర్శి రహ్మతుల్లా, మండల అధ్యక్షుడు పరమేష్, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఆత్మకూర్‌లో కాంగ్రెస్ జెండా పండుగల సందర్భంగా జెండా కట్టలకు రంగులద్ది ముస్తాబు చేశారు. ప్రజల్లో మార్పు వస్తుందని బీఆర్ఎస్ మోసపూరిత పాలన, బీజేపీ మతతత్వ పాలనతో ప్రజలు విసుగెత్తి పోయారని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 90 స్థానాల్లో గెలిచి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గంగ, ఈర్లదిన్నె శ్రీను, మన్యం, జానకీరాం, కేశవ్, శ్రీకాంత్, కావలిరవి తదితరులు ఉన్నారు.

జూరాల విద్యార్థి ప్రతిభ



ఆత్మకూర్: బాసర ట్రిబుల్ ఐటీలో జనరల్ కేటగిరిలో జూరాల గ్రామానికి చెందిన చాకలి మణ్యం సీటు సాధించాడు. గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈఏడాది పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 9.8 గ్రేడ్ సాధించి మండల టాపర్‌గా నిలిచాడని ఎంఈఓ భాస్కర్‌సింగ్ తెలిపారు. గతంలో కూడా ఇదే గ్రామానికి చెందిన విద్యార్థి శ్రీనాథ్ బాసర ట్రిబుల్‌ఐటీలో సీటు సాధించినట్లు గుర్తు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మహిమూద, పాఠశాల హెచ్ఎం రాఘవేందర్, ఉపాధ్యాయులు సంతోష్‌కుమార్, నాగప్రి, షకీల్‌అహ్మద్, నరేష్, విద్యాకమిటీ చైర్మన్ మద్దిలేటి విద్యార్థిని అభినందించారు.

కమ్యూనిటీ భవన నిర్మాణ పనుల పరిశీలన

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండల కేంద్రంలో రజక సంఘం కమ్యూనిటీ భవన నిర్మాణ పనులను జిల్లా రజక సంఘం అధ్యక్షుడు విజయ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు రజకుల సంక్షేమం గురించి పట్టించుకోలేదని, సీఎం కేసీఆర్ తమ సంక్షేమం, అభివృద్ధి గురించి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని కొనియాడారు. తమకు ఉచితంగా కరెంట్ ఇవ్వడంతో పాటు దోబీ ఘాట్‌లను నిర్మిస్తున్నారని తెలిపారు. మంత్రి నిరంజన్‌రెడ్డి సహకారంతో పెద్దమందడి మండల కేంద్రంలో కమ్యూనిటీ భవనం నిర్మాణం పూర్తి కావస్తుందని, వచ్చే ఎన్నికల్లో రజకులు మంత్రి నిరంజన్‌రెడ్డికి అండగా ఉంటారన్నారు. కార్యక్రమంలో పాపన్న, లక్ష్మీనారాయణ, చెన్నమ్మ తదితరులు ఉన్నారు.



ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి



పాన్‌గల్ ప్రాథమిక పాఠశాలలో ప్రార్థనలో పాల్గొన్న ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్



పాఠశాలల ఆడిట్ వివరాలను పరిశీలిస్తున్న సీఆర్పీ

పాన్‌గల్: ఉపాధ్యాయులు సమయపాలన తప్పక పాటించాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను ప్రార్థన సమయంలో సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లు, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారి సామర్థ్యాలను పెంచేలా బోధన సాగించాలని ఆదేశించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించి పాఠశాల నిర్వహణ, విద్యార్థుల సామర్థ్యాలు, రీడ్ ప్రోగ్రాం తదితర అంశాలపై చర్చించి పలు సూచనలు, సలహాలను ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్ఎం అలివేలు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పాఠశాలల ఆడిట్

మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు 2022–23 సంవత్సరంలో మంజూరైన నిధులు, వినియోగం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఆడిట్ కొనసాగుతున్నట్లు ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని గోప్లాపూర్ ప్రాథమికోన్నత, కేతేపల్లి, అన్నారం, శాగాపూర్‌తండా, మల్లాయిపల్లితండాల ప్రాథమిక పాఠశాలల ఆడిట్ చేశారన్నారు. ఆడిట్ మూడు రోజులుగా కొనసాగుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇప్పటికీ 15 పాఠశాలల ఆడిట్ పూర్తయిందని తెలిపారు. మిగిలిన పాఠశాలల హెచ్ఎంలు ఈనెల 5వ తేదీ వరకు ఆడిట్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు శ్రీనివాసులు, శివకుమార్, రాధ, సిరాజ్‌ద్దీన్, తిరుపతయ్య, సీఆర్పీ శేఖర్‌నాయక్ పాల్గొన్నారు.

అర్హులందరికీ దళితబంధు ఇవ్వాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

అమరచింత: రాష్ట్రంలో అర్హులైన ప్రతి దళితుడికి దళితబంధు పథకాన్ని అందించి వారి అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేయాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి రవీందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ చాంద్‌పాషాకు సోమవారం వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితబంధు మొదటి విడతలో అట్టహాసంగా ప్రారంభించి అతి కొద్ది మందికి మాత్రమే ఇచ్చారని ఆరోపించారు. రెండో విడత వేగవంతంగా చేయాలని డిమాండ్ చేశారు. రెండో విడత దళితబంధు ఎంపికలో రాజకీయ జోక్యం ఉండకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో దళిత కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయని, వారిని గుర్తించి ఆదుకోవాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి నాయకులు భాస్కర్, శ్యాంసుందర్, సాలు, దేవరాజ్, రవి, మోష, ఎర్రన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించే హక్కు రాజ్యాంగం కల్పించింది



మాట్లాడుతున్న డాక్టర్ మురళీధర్

వనపర్తి టౌన్: ప్రభుత్వాలను ప్రశ్నించిన జర్నలిస్టు తులసిచందును బెదిరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని రాష్ట్ర స్వేచ్ఛ జేఏసీ కన్వీనర్ బొల్లి ఆదామ్‌రాజు అన్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదామ్ రాజు అధ్యక్షతన నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి డాక్టర్ మురళీధర్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, ప్రజా కవి జనజ్వాల ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రశ్నించే హక్కును భారత రాజ్యాంగం కల్పించిందని, ప్రతి ఒక్కరూ ప్రశ్నిస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. దేశ, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రశ్నించిన తులసిచందును బెదిరించడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. భీమ్ ఆర్మీ చీఫ్, ఆజాద్ సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు రావణ్ చంద్రశేఖర్ ఆజాద్ జరిపిన మతోన్మాద దుండగుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, కేసులు నమోదు చేసి దుండగులను న్యాయబద్ధంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో కృష్ణయ్య, రవి, చిన్న రాములు, ప్రజా, రైతు, కుల, గణేష్, గోవిందు, రాధాకృష్ణ, గంధం నాగరాజు, బాల్య నాయక్, పరమేశ్వరాచారి, నరేందర్, శాంతన్న, సాయిలీల, మంద ప్రశాంత్, కేశవులు, నక్క రాములు యాదవ్, ఎల్లయ్య, గద్వాల చెన్నయ్య పాల్గొన్నారు.

అర్హులందరికీ ఓటుహక్కు కల్పించాలి

వనపర్తి: రానున్న అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా 2023 అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండే యువతకు ఓటు హక్కు కల్పించాలని కలెక్టర్ సూచించారు. యువత స్వచ్ఛందంగా తమ పేరును ఓటరు జాబితాలో నమోదు చేయించుకునే విధంగా అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. సోమవారం ప్రజావాణి హాల్‌లో జిల్లా అధికారులకు ఎన్నికల సన్నద్ధతపై సూచనలు చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్, డీఎఫ్ఓ నవీన్‌కుమార్‌రెడ్డి, డీఆర్‌డీఓ నర్సింహులు, డీఏఓ సుధాకర్‌రెడ్డి, జిల్లా ఉద్యానశాఖ అధికారి సురేష్, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగంలో..

వ్యవసాయ రంగంలో ఏదైనా ఒక నూతన ఆవిష్కరణలు జరిగి ఉంటే వాటిని ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంలో నమోదు చేయించాలని కలెక్టర్ అన్నారు. సోమవారం ఇంటింటా ఎన్నోవేటర్ కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. నూతన ఆవిష్కరణలు వ్యవసాయ రంగంలో, గ్రామస్థాయిలో అనేకం జరుగుతుంటాయి వాటిని తెలుసుకొని ఇంటింటా ఇన్నోవెటర్ అనే కార్యక్రమానికి పంపించేందుకు సెల్: 91006 78543 వాట్సాప్ నంబరు పంపించాలని సూచించారు. అన్ని ఆవిష్కరణలను హైదరాబాద్‌లోని సాంకేతిక శాఖకు పంపిస్తామని తెలిపారు. ఉత్తమమైన ఆవిష్కరణలను ఆగస్టు 15న జరిగే స్వాతంత్య్ర దినోత్సవ రోజున పరేడ్ గ్రౌండ్‌లో ఒక స్టాల్ ఏర్పాటు చేసి ప్రదర్శిస్తారన్నారు.

క్రీడా పాఠశాలల్లో..

హకీంపేట క్రీడా పాఠశాలలో ప్రవేశాల కోసం జిల్లా నుంచి అత్యధిక సంఖ్యలో విద్యార్థులు అర్హత సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డీవైఎస్ఓ సుధీర్ రెడ్డిని ఆదేశించారు. రాష్ట్ర క్రీడల పాఠశాల వాల్‌పోస్టర్లను అధికారులతో కలిసి విడుదల చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జూలై 13న జిల్లా కేంద్రంలోని డాక్టర్ బాలకిష్టయ్య క్రీడా మైదానంలో క్రీడా పాఠశాలలో చేరాలని ఆసక్తి ఉన్న 4, 5వ తరగతి విద్యార్థులకు అర్హత పరీక్షా నిర్వహించనున్నట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో గురుపూర్ణిమ వేడుకలు



వనపర్తిలో ఆధ్యాత్మిక గురువును సన్మానిస్తున్న వైస్ చైర్మన్, శిష్య బృందం



శ్రీరంగాపురంలో..



ఆత్మకూర్ సాయిబాబా ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణమ్మ



వనపర్తి పాతకోట ఆలయంలో..

వనపర్తి: గురుపౌర్ణమిని పురస్కరించుకొని సోమవారం జిల్లా వ్యాప్తంగా సాయిబాబ మందిరాలు భక్తులతో కిటకిటలాడాయి. జిల్లా కేంద్రంలోని మెట్‌పల్లి షిర్డిసాయిబాబ ఆలయంలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని జంగమాయపల్లి, బలిజపల్లి జంట గ్రామాల్లో ఉన్న సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబాకు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యవర్గ సభ్యుడు టి.అశ్వద్ధామరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.కృష్ణ, శ్రీశైలం, వెంకటేశ్వర్‌రెడ్డి, బాసెట్టి శ్రీనివాసులు, ప్రభాకర్, ఈశ్వర్‌గౌడ్, రాయన్నసాగర్ పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలో గల శ్రీరంగనాథ ఆలయంలో సోమవారం స్వామివారికి అభిషేకం, అలంకరణ, గణపతిపూజ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. ఆలయ అర్చకులు విష్ణునారాయణ శర్మ, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: గురుపౌర్ణమి మహోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఆత్మకూర్‌లోని సాయిబాబా మందిరానికి భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా తెల్లవారు జామున 5గంటలకు సుప్రభాతం, 5.30గంటలకు కాగడహారతి, 6.15నుంచి విఘ్నేశ్వర, నందీశ్వర, దత్తాత్రేయ, సంతాన నాగదేవత, జ్యోతిర్లింగ, రాంపరివార్, లక్ష్మీదేవి, షిర్డిసాయినాథ్‌లకు పంచామతాభిషేకం, 8గంటలకు కావిడి ఉత్సవం, 9గంటలకు అర్చన, అష్టోత్తరం, మధ్యాహ్నం 12గంటలకు హారతి, 12.30గంటలకు అన్నదానం, సాయంత్రం 6.20గంటలకు దూపహారతీ, 6.45కు సాయి భజన, రాత్రి 7.30గంటలకు పల్లకీసేవ, 8.40గంటలకు సేజారతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహబూబ్‌నగర్ జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ స్వర్ణమ్మ తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు దివాన్జీప్రభాకర్‌రావు, సంతోష్‌కుమార్, రమేష్‌శెట్టి, సింగండయ్, శ్రీరాములు, భక్తులు పాల్గొన్నారు.

14ఏళ్లుగా భక్తులకు అన్నదానం

గురుపౌర్ణమి సందర్భంగా పూజలకు హాజరైన భక్తులకు కట్టెలమండి లక్ష్మి, యుగేందర్ దంపతుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. 15 ఏళ్లుగా అన్నదాన కార్యక్రమాన్ని చేపడుతున్న వారిని ఆలయ నిర్వాహకులు సత్కరించి అభినందించారు.

అమరచింత: పట్టణంలోని షిర్డిసాయి ఆలయంలో గురుపూర్ణిమను పురస్కరించుకొని సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం గణపతి హోమంతో పూజలను ప్రారంభించారు. పవిత్ర కృష్ణానది జలాలను తీసుకొచ్చి షిర్డిసాయి విగ్రహానికి అభిషేకించారు. అనంతరం పంచామృతాలతో సాయికి పూజించారు. ఆలయ ఆవరణంలో షిర్డిసాయి సత్యవ్రతం నిర్వహించారు. పూజలో పాల్గొన్న భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం షిర్డిసాయి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో పట్టణ పురవీధుల గుండా ఊరేగించారు.



జంగమాయపల్లి-బలిజపల్లిలో..

వనపర్తి టౌన్: గురు పౌర్ణమి సందర్భంగా ఆధ్యాత్మిక అయ్యప్ప మాలధారణ గురువు ముత్తుకృష్ణ గురుస్వామికి మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, కౌన్సిలర్ కాగితాల లక్ష్మీనారాయణ, సింగల్ విండో మాజీ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, కటకం చంద్రుడు, వెంకన్న తదితరులు పాదపూజ చేసి, ఆశీస్సులు అందుకున్నారు. అదేవిధంగా టీడీపీ ఆధ్వర్యంలో పట్టణ అధ్యక్షుడు నందిమల్ల అశోక్ ఆధ్యాత్మిక గురువు ముత్తు కృష్ణ గురుస్వామి, చిన్నతనంలో విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయురాలు బండారు పద్మ, భద్రాసేనయ్య, సుదర్శన్ రెడ్డి తదితరులను వారి నివాసంలో ఘనంగా సన్మానించారు. తెలుగు మహిళ రాష్ట్ర నాయకురాలు నందిమల్ల శారద, నాయకులు రవి యాదవ్, కౌన్సిలర్ లక్ష్మి పాల్గొన్నారు.

పాతకోటలో..

పట్టణంలోని పాతకోట శివాలయంలో తిరుపతి నంద చరన్ స్వామి ఆధ్వర్యంలో తరూర్మాస పూజలను గురు పౌర్ణమి సందర్భంగా సోమవారం ప్రారంభించారు. సెప్టెంబర్ 30న చండి యాగం, రుద్ర హోమం నిర్వహించేందుకు నేటి నుంచి 90 రోజుల పాటు ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్నట్లు ఆలయ చైర్మన్ పూరి సురేష్‌శెట్టి తెలిపారు. ప్రతి శనివారం సత్యనారాయణ వ్రతం నిర్వహిస్తామని ఆసక్తి కలిగిన భక్తులందరూ పాల్గొనేందుకు చొరువ చూపాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శ్రీరామమూర్తి, రవిసాయి, ఈశ్వరమ్మ, బుచ్చన్న, శోభారాణి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.



అమరచింతలో..

క్లుప్తంగా

సకాలంలో రుణాలు చెల్లించాలి



అమరచింత: బ్యాంకు ద్వారా మహిళా సంఘాలతో పాటు చిరువ్యాపారులకు రుణాలను ఇప్పించడంలో కీలక పాత్ర పోషిస్తున్న మెప్మా ఆర్పీలు రుణాలను తిరిగి బ్యాంకుకు సకాలంలో చెల్లించేందుకు చొరవ చూపాలని యూనియన్ బ్యాంక్ మేనేజర్ శివశంకర్ అన్నారు. బ్యాంక్ మేనేజర్ కార్యాలయంలో సోమవారం మెప్మా కోఆర్డినేటర్‌తో పాటు ఆర్పీలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణాలను సకాలంలో చెల్లించిన సంఘాలకు ప్రస్తుతం రూ.ఐదు నుంచి పది లక్షల వరకు రుణాలను అందిస్తున్నామన్నారు. అదే విధంగా చిరువ్యాపారులకు రూ.పది వేలు పూర్తిగా సకాలంలో చెల్లించిన వారికి రూ.20 వేలు, రూ.20 వేలు చెల్లించిన వారికి రూ.50వేలు బ్యాంకు ద్వార త్వరితంగా అందిస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో మెప్మా కోఆర్డినేటర్ యువరాజ్, ఆర్పీలు గోపాల్, ఖాజా, రాజేశ్వరి, సంగీత తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక



కొత్తకోట: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధిని చూసి మాజీ ఉప సర్పంచ్ జనార్దన్‌సాగర్ బీఆర్ఎస్‌లో చేరారు. ఆయనకు మున్సిపల్ చైర్‌పర్సన్ పి.సుఖేశిని, జెడ్పీటీసీ మాజీ సభ్యులు విశ్వేశ్వర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

పాఠశాలకు ఫర్నీచర్ వితరణ



ఆత్మకూర్: ప్రభుత్వ పాఠశాలకు ఫర్నీచర్, విద్యార్థులకు నోట్‌బుక్కులను ఎంపీటీసీ మాజీ సభ్యుడు వెంకటనర్సింహారావు, ఉపధ్యాయరాలు అనురాధ దంపతులు అందజేశారు. రూ.12వేలు సొంత నిధులతో సోమవారం మండలంలోని గుంటిపల్లి ప్రభుత్వ పాఠశాలకు విద్యార్థులకు నోట్‌బుక్కులు, టేబుల్, బోర్డులు అందించారు. పాఠశాల హెచ్ఎం ఉమాశంకర్, సీఆర్పీ సౌమ్యరాణి, ఉపాధ్యాయులు వారిని శాలువాతో సత్కరించారు.

వేతనాలు పెంచాలి



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు పెంపుతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని సోమవారం సర్పంచ్ వినీలారాణికి వినతిపత్రం అదించారు. వారు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం కల్పించి, జనాభా ప్రాతిపదికన కాకుండా, అవసరం ప్రాతిపదికన కార్మికులను నియమించాలన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తికి సపర్యలు



పెబ్బేరు: మండలంలోని గుమ్మడంలో ఒరిస్సా రాష్ట్రానికి చెందిన దీపక్ మతిస్థిమితం కోల్పోయి తిరుగుతుండగా సోమవారం గ్రామస్తులు చేరదీశారు. ఈ సందర్భంగా అతనికి కడుపునిండా భోజనం పెట్టి, క్షవరం, స్నానం చేయించడంతో పాటు కొత్త బట్టలు తొడిగించారు. కార్యక్రమంలో రాముడు, శ్రీకాంత్, యాదగిరి, గాండ్ల శివ, బత్తుల రాముడు, స్వామి, బలరాముడు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని రాయిగడ్డకు చెందిన దాసరి ఐలమ్మ అనారోగ్యంతో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న పెద్దమందడి ఎంపీపీ మేఘారెడ్డి రూ.5వేల ఆర్థికసాయాన్ని టీఎంఆర్ యువసేన నాయకులకు ద్వారా బాధిత కుటుంబానికి సోమవారం అందజేశారు. మేఘారెడ్డికి ఐలమ్మ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ జమ్ములమ్మ జయమ్మ, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.